క్లుప్తంగా

చందోలులో హరిద్ర శృంగార్చన



హరిద్ర శృంగార్చన పూజా కార్యక్రమంలో భాగంగా పూజలు చేస్తున్న భక్తులు

పిట్టలవానిపాలెం: చందోలు బగళాముఖి అమ్మవారి ఆలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలులోని బగళాముఖి అమ్మ ఆలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు బలిజేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

బలిజేపల్లి(వేమూరు): బలిజేపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి మేరుగ నాగార్జున గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

పరీక్ష కేంద్రం కొనసాగించాలి

వేమూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు మంగళవారం ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటుచేయడం సరికాదని, విద్యార్థులకు దూరాభారం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్య రాజేష్, శ్రీను, మోహన్ చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు కంటి పరీక్షలు

వేమవరం(భట్టిప్రోలు): వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా 60 ఏళ్లు పైబడిన అవ్వాతాతలకు ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పారా మెడికల్ ఆప్తాలమిక్ అసిస్టెంట్ (పీఎంవోఏ) పెనుమాల అరుణ రాణి తెలిపారు. భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 52 మందిని పరీక్షించగా 10 మందికి కళ్లజోళ్లు అవసరమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉషా, సిబ్బంది శ్యామ్‌సుందరరావు, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు కాంతి మణి, సుజాత, గోవర్ధన పాల్గొని తమ సేవలు అందించారు. బుధవారం కన్నెగంటివారిపాలెంలో వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

నేడు అభివృద్ధి పనులపై సమీక్ష

రేపల్లె: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులతోపాటు వివిధ అంశాలపై బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక సీతారామ యోగిని కల్యాణ మండపంలో సమీక్ష నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అధ్యక్షతన జరిగే సమావేశంలో కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, 28 వార్డుల వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులకు శిక్షణ

బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు ఫ్యాకల్టీ ఆన్‌రైడ్ యూసింగ్ అండ్ గూగుల్‌కోల్డ్ డిజిటల్ లీడర్ కోర్సుల్లో ఎల్4జీ గూగుల్ డెవలపర్స్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ పూర్తి చేసేందుకు రూ.2 లక్షల విలువ చేసే కూపన్‌లను ఎల్4జీ సంస్థ అందజేసింది. విద్యార్థులకు డాక్టర్ డి.కిషోర్‌బాబు, కె.అరుణ్‌బాబు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాసరావు, సెక్రటరీ ఎం.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ నజీర్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ పి.పార్థసారథి, సీబీడీఎస్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.చక్రధర్, సీనియర్ ఉపాధ్యాయులు డాక్టర్ ఎన్.సుధాకర్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బాపట్ల అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్–2023లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పట్టణంలోని రోటరీ కల్యాణ మండపంలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఫిబ్రవరి 26న ప్రకాశం జిల్లాలో జరిగిన కరాటే పోటీలలో బాపట్ల జిల్లా నుంచి పాల్గొన్న విద్యార్థులు గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కార్యక్రమంలో కోచ్ యర నాగేశ్వరరావు, టీం మేనేజర్ అల్లూరి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఎం.గోపీనాథ్, బాబి పాల్గొన్నారు.



తెనాలిలో జరిగిన రైతు భరోసా సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్యే కోన రఘుపతి

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

- అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణ
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



బేతపూడిలో మహిళలతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లె రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు మంగళవారం సాయంత్రం మండలంలోని బేతపూడి, ఎస్సీ కాలనీలలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామ ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతపూడి ఎస్సీ కాలనీలో రహదారులు, డ్రెయిన్‌లు లేవని, విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయని కాలనీ వాసులు విన్నవించారు. స్పందించిన మోపిదేవి వెంకట రమణారావు సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలిచ్చి పలు సమస్యలకు పరిష్కారం చూపారు. గ్రామంలోని 230 గృహాలను సందర్శించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

జెడ్పీటీసీ సభ్యులు బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బేతపూడి గ్రామానికి చెందిన బేతపూడి భాస్కరరావుతోపాటు పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు మోపిదేవి వెంకటరమణారావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్ ఆలూరి పద్మ, జెడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు కొమరాబత్తుని జయమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో మోపిదేవి

గృహనిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలి

బాపట్ల: గృహనిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సచివాలయం ఉద్యోగుల సమీక్షలో మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడారు. సచివాలయంలో వార్డుల వారీగా అర్హులైన లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. గృహాలు నిర్మించుకోలేని పేదలకు బ్యాంకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంపై వారానికి ఒకసారి నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో టీపీఓ శ్రీలక్ష్మి, మెప్మా టీఎంఎం నాయక్, సీఓ వనజ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ భానుప్రతాప్

మూడు పూరిళ్లు దగ్ధం

- కట్టుబట్టలతో మిగిలిన బాధితులు

చెరుకుపల్లి: అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఈ దుర్ఘటన రాంబొట్లపాలెం పంచాయతీ మోరవాకుపాలెం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. మంగళవారం ఇళ్లల్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తూ మంటలు అంటుకుని వ్యాపించాయి. దీంతో గ్రామానికి చెందిన పినుకుల శ్రీనివాసరెడ్డి, పినుకుల రామిరెడ్డి, పినుకుల వెంకట సుబ్బారెడ్డికి చెందిన మూడు పూరిళ్లు, గేదెల చావిడి, ఆరు ఎకరాల్లోని రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చే లోపే మూడు ఇళ్లు కాలి బుడిదయ్యాయి. పినుకుల రామిరెడ్డి ఇంటి నిర్మాణం కోసం ఇటీవల రూ.5లక్షలు నగదు వెచ్చి ఇంటిలో పెట్టుకున్నాడు. శ్రీనివాసరెడ్డి వ్యవసాయ ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు నగదు ఇంట్లో దాచాడు. దీంతోపాటు రామిరెడ్డి ఇంటిలో ఉన్న కొంత నగదు అగ్నికి ఆహుతైంది. మూడు ఇళ్లలో ఉన్న బంగారం, పొలం దస్తావేజులు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఆస్తి నష్టం సుమారు రూ.20 లక్షలు ఉంటుందని సమాచారం. గ్రామ సర్పంచ్, బాపట్ల జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం బియ్యం నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని చెప్పారు.

నేడు బహిరంగ వేలం

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలు గ్రామంలోని బగళాముఖి బండ్లమ్మ ఆలయంలో పూజాద్రవ్యముల విక్రయ దుకాణం హక్కు కోసం మార్చి 1న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 ఏప్రిల్ 1 వరకు ఆలయ ఆవరణలో టెంట్ సామగ్రి, వంట సామగ్రి, పూల డెకరేషన్, ఫంక్షన్‌లకు కరెంట్ సరఫరా వంటి హక్కుల కోసం బుధవారం ఉదయం బహిరంగ వేలం జరుగుతుందని వివరించారు. ఆసక్తి కలిగిన వారు డిపాజిట్ రుసుము రూ.5 వేలు చెల్లించి ఈ వేలంలో పాల్గొనవచ్చని వెల్లడించారు.

సమన్వయంతో పనిచేద్దాం

ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య

నగరం: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులం సమన్వయంతో పనిచేద్దామని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకు తీసుకు వెళ్లేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థ లక్ష్యాలు సాధించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించేలా చూడాలన్నారు. తొలుత శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మాన్యం నాగమణి, ఎంపీడీఓ ఎస్.రాధారమణ, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కర్లపాలెం: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని గమేషన్ మిల్లు సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పొన్నూరు మండలం చింతలపూడి గ్రామానికి చెందిన కొప్పుల విజయ్‌కుమార్ కుమారుడు దేవేంద్రనాథ్(30) కొంతకాలంగా కర్లపాలెం మండలం పాతనందాయపాలెంలో ఉన్న తన అక్క దీప్తి సౌజన్య ఇంటి వద్ద ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తండ్రితో అతను ఫోన్‌లో మాట్లాడాడు. అనంతరం బెడ్‌రూంలోకి వెళ్లాడు. సాయంత్రం అక్క దీప్తిసౌజన్య, బావ విజయబాబు బెడ్‌రూమ్ తలుపు తట్టి పిలిచినా దేవేంద్రనాథ్ పలకలేదు. దీంతో తలుపులు పగలకొట్టి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండటంతో అతనిని కర్లపాలెంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. దేవేంద్రనాథ్‌ను పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందాడని చెప్పారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. దేవేంద్రనాథ్ మృతికి కారణాలు తెలియలేదని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కర్లపాలెం పోలీసులు తెలిపారు.

కాంతుల 'హర'విల్లు



విద్యుద్దీప అలంకరణలో గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం



ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

- రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం
- 6న వైభవంగా రథోత్సవం
- 7 వరకు వేడుకలు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమి గ్రామంలో కొలువైన గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి నవాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి విఘ్నేశ్వరుని పూజతో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. తెల్లవారుజామున ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. విద్యుద్దీప అలంకరణలో ఆలయం ధగధగ మెరిసిపోతోంది. కల్యాణ మహోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన స్వామి దివ్య రథోత్సవం ఈ నెల 6న జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఈమని అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవాలు 7వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు,పెదపులివర్రు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తునట్లు ఇన్‌ఛార్జ్ ఏఈ పి.ఏడుకొండలు మంగళవారం తెలిపారు. రేపల్లె 33 కేవీ లైన్ మరమ్మతులు నిర్వహిస్తున్న దృష్ట్యా సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఘనంగా టైలర్స్ డే



కర్లపాలెంలో విలియం హోవే చిత్రపటం వద్ద నివాళులర్పించిన టైలర్లు

కర్లపాలెం/భట్టిప్రోలు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను దర్జీలు వినియోగించుకోవాలని కర్లపాలెం మండల టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పఠాన్ సుబాన్‌ఖాన్ తెలిపారు. టైలర్స్ డే సందర్భంగా మంగళవారం టైలర్లు కర్లపాలెం సెంటర్‌లో యూనియన్ జెండా ఆవిష్కరించి కుట్టు మిషన్‌ను కనిపెట్టిన విలియం హోవే చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ టైలర్లను యూనియన్ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్‌కే బుజ్జి, ఉపాధ్యక్షుడు షేక్ బాజీ, ట్రెజరర్ షేక్ బాబు, పఠాన్ సర్దార్ ఖాన్, ఎంపీటీసీ ఆసిఫ్ అలీ, మాజీ ఎంపీటీసీ ఎస్‌కె బాజీ పాల్గొన్నారు.

- భట్టిప్రోలులోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో విలియమ్స్‌హోవే చిత్రపటానికి టైలర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టైలర్లకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

చెరుకుపల్లిలో..

చెరుకుపల్లి: బాపూజీ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దర్జీల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంఘ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వై,వెంకటేశ్వర్లు మాట్లాడారు. తొలుత విలియం హోవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. సంఘ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్‌కే బాషా, ఎస్‌కే బాజీ, కె.నాగేశ్వరరావు, కె.చంద్రమౌళి, జి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

6న బజరంగ్ నేత్ర జ్యోతి ఉచిత వైద్య శిబిరం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, తదితరులు

బాపట్ల అర్బన్: బాపట్ల మండలంలోని ముత్తాయపాలెం సచివాలయం పరిధిలోని తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులకు, ప్రజలకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు ఈనెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లను అందిస్తామని వెల్లడించారు. శిబిరాన్ని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరం' పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే కోన రఘుపతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కళ్లం హరినాథరెడ్డి, ధృతి కన్వీనర్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ, శీలం శ్రీనివాసరావు, ఇక్కుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కదిలింది కర్షక లోకం



కొల్లూరు గౌడపాలెం నుంచి సీఎం సభకు తరలివెళుతున్న రైతులు



భట్టిప్రోలు మండలం ఓలేరులో సీఎం సభకు వెళ్తున్న కర్షకులు

సీఎం సభకు భారీగా తరలిన రైతులు

కొల్లూరు/భట్టిప్రోలు: తెనాలిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన రైతు భరోసా సభకు కర్షక లోకం స్వచ్ఛందంగా తరలివెళ్లింది. తెల్లవారుజాము నుంచి కొల్లూరు, భట్టిప్రోలు మండలాల నుంచి రైతులు ప్రత్యేక వాహనాల్లో పయనమయ్యారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌కు జేజేలు పలికారు. భట్టిప్రోలు మండలంలోని ఓలేరులో గ్రామ సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీటీసీ సభ్యులు నీలా సాంబమ్మ, వెల్లటూరులో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఏఓ జి.మీరయ్య, గ్రామ సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు దారావత్ కుమారిబాయిల ఆధ్వర్యంలో రైతులు ప్రత్యేక బస్సుల్లో తెనాలి తరలివెళ్లారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



హాజరైన కౌన్సిలర్‌లు, అధికారులు

రేపల్లె: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక వాహనాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. మున్సిపల్ చేతిపంపులకు తక్షణమే మరమ్మతులు చేయిస్తామన్నారు. కౌన్సిలర్లు పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. నిరంతరం పనులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం అజెండాలోని 14 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రతిభా ప్రదర్శన



బాపట్లలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ నిరంజన్



కర్లపాలెంలో సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎలీషాబాబు, జెడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి

బాపట్ల/నగరం/వేమూరు/భట్టిప్రోలు/రేపల్లె రూరల్/కర్లపాలెం: సైన్స్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతుందని ఎంఈఓ నిరంజన్ చెప్పారు. సీవీ రామన్ సైన్స్ క్లబ్ అధ్యక్షులు వై.నాగవర్ధనరావు ఆధ్వర్యంలో మంగళవారం సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రతిభా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ నిరంజన్ మాట్లాడుతూ సీవీ రామన్ సైన్స్ క్లబ్ తొమ్మిదేళ్లుగా చేస్తున్న కృషిని కొనియాడారు. పోటీల్లో సీఎస్ఎస్ఎన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నాయుడు స్కూలు ప్రథమస్థానం, పటేల్‌నగర్ పాఠశాల ద్వితీయ స్థానం, డీకే పాలెంకు చెందిన పాఠశాల మూడో స్థానం సాధించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురం సాంబశివరావు, వై.నాగవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని ఎస్వీఆర్ఎం కళాశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఫిజిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ పంచమర్తి శ్రీనివాసరావు సైన్స్ ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటనారాయణ పాల్గొన్నారు. పూడివాడ శ్రీఅచ్యుత ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది.
- వేమూరు మండలం జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం బద్రి నారాయణ బహుమతులు అందించారు. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు పోతురాజు, డి.ప్రభావతి, నరసింహారావు పాల్గొన్నారు.
- భట్టిప్రోలు మండలం టీఎంరావు హై స్కూల్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు సైన్సు నమూనాలు ప్రదర్శించారు. సీవీ రామన్ చిత్రపటాన్ని పూలు, ఖద్దరు మాలలతో అలంకరించారు. ప్రధానోపాధ్యాయులు సి.రామకోటేశ్వరరావు సైన్స్ ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు కేవీ లక్ష్మిపార్వతి, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, సత్యరత్న, ఎండీ అనూల్‌హక్, చేబ్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- కర్లపాలెంలోని శ్రీభార్గవి హైస్కూల్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీభార్గవి హైస్కూల్ చైర్మన్ పేరాల వెంకటసురేష్ పాల్గొన్నారు.
- రేపల్లె రూరల్ మండలం నల్లూరుపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ డెప్యూటీ జనరల్ మేనేజర్ అమిరినేని సత్యనారాయణ ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులకు ఆయనతోపాటు వ్యాపారవేత్త యలవర్తి వెంకటేశ్వరరావు, గ్రామస్తుడు కారుమూరు మరియదాసు బహుమతులు అందించారు. సైన్స్ ఉపాధ్యాయుడు లచ్చి కోటేశ్వరరావు, హెచ్ఎం ఈగ మునియ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా తయారు కావాలి

పిట్టలవానిపాలెం: పిట్టువారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సైన్సు ఎగ్జిబిషన్‌ను పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నాంచారమ్మ, గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షురాలు యేట్ర అశ్విని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. హెచ్ఎం పరిశ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం